సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 19, మే, 2023



ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ఫస్ట్

గృహ నిర్మాణ లక్ష్యాన్ని అధిగమించి జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంపై కలెక్టర్‌ను ఉన్నతాధికారులు అభినందించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,390
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,603
3 శాతం జీఎస్టీతో	రూ.5,771
నవర (8 గ్రా)	రూ.46,168

గరిష్టం/కనిష్టం
40.0 /29.6

వాతావరణం

గురువారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. పలు మండలాల్లో వర్షం కురిసింది. గాలిలో 71 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

స్త్రీనిధి రుణాల రికవరీ బాధ్యత సీసీలదే..


• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): స్త్రీనిధి రుణాలకు సంబంధించి రికవరీల బాధ్యత సీసీలపై ఉందని ఈ విషయంలో కథలు చెబితే సహించేది లేదని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో స్త్రీనిధి రికవరీలపై వివిధ మండలాల సీసీలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. లోన్లు రీ షెడ్యూల్ చేసి రికవరీ చేయాలన్నారు. సభ్యుల నుంచి రికవరీ చేయకుంటే మీ సొంత నగదు చెల్లించాలన్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి రుణాలు తీసుకున్న లబ్ధిదారులతో చర్చించి రికవరీలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే సీసీలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్ని పర్యాయాలు చెప్పినా కొందరిలో మార్పు రావడంలేదని ఉద్యోగం నుంచి తొలగిస్తే మార్పు వస్తుందా అని ప్రశ్నించారు. సమావేశంలో ఏపీడీ రాజు, స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య పాల్గొన్నారు.

సోమశిలలో 45.940 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 45.940 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 188 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 2,450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 95.492 మీటర్ల నీటి మట్టం ఉంది.

నేటి నుంచి వలంటీర్లకు సన్మానాలు

నెల్లూరు(పొగతోట): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లకు శుక్రవారం నుంచి సన్మానాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదేశించారు. నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఎల్‌పీఓలతో గురువారం నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. నెలరోజుల పాటు సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అత్యుత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతోపాటు నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. సన్మానాలకు ఎమ్మెల్యేలు, మండలాల ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు అధికం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పేదల కష్టాలు తీరుస్తాం

• సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు
• ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు పక్కాగా అందిస్తాం. దీనిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. పేదల కష్టాలు తీర్చడమే లక్ష్యమని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో హరినారాయణన్‌ను గురువారం 'సాక్షి' ఇంటర్వ్యూ చేయగా అనేక విషయాలు వెల్లడించారు. జిల్లాలో నాడు – నేడు పనులు, ఇళ్ల నిర్మాణంలో పురోగతి, భూముల రీ సర్వే తదితర వాటి గురించి వివరించారు.

సాక్షి : జిల్లాలో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతోంది?

కలెక్టర్ : మొదటి విడతకు సంబంధించి 56 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. తాజాగా 32 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాం. దీంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో 12 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాం. నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. అర్బన్ ప్రాంతాల్లో కూడా నిర్మాణాలు జరుగుతున్నాయి. తాజాగా రూ.75 లక్షల వరకు బిల్లులు మంజూరు చేయించాం.

సాక్షి : నాడు – నేడు పనులు ఎంత వరకు వచ్చాయి?

కలెక్టర్ : మనబడి నాడు – నేడు పథకం కింద పాఠశాలల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పూర్తయ్యేలా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం పనులు చేయిస్తున్నాం. ప్రధానంగా ఏడు అంశాలను ప్రాధాన్యతా క్రమంలో నిర్ణయించాం. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కిచెన్, క్లాస్‌రూంలో సౌకర్యాలు తదితరాలు ఇందులో ఉన్నారు. రోజూ సమీక్ష నిర్వహించి పనులు వేగంగా జరిగేలా చూస్తున్నాం.

సాక్షి : 'జగనన్నకు చెబుదాం' గురించి..

కలెక్టర్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాం. గ్రామస్థాయిలో వచ్చే ఫిర్యాదులకు సంబంధించి మండల స్థాయి అధికారిని ప్రత్యేక విచారణాధికారిగా నియమించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. గడిచిన వారంలో స్పందన, జగనన్నకు చెబుదాంకు సంబంధించి 490 అర్జీలు వచ్చాయి. అధికారులను నేరుగా బాధితుల ఇంటికి పంపి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నాం. విచారణాధికారి బాధితుడితో ఫొటో దిగి పంపించాలి. ఈ కార్యక్రమం చాలా మంచిది.

సాక్షి : ఉద్యోగ జీవితంలో మీకు సంతృప్తినిచ్చిన సంఘటనలు..

కలెక్టర్ : విశాఖపట్నం కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న సమయంలో గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ చేపట్టాం. నగరంలో 6 పాఠశాలలను మోడల్‌గా అన్ని హంగులతో తీర్చిదిద్దడం ఎంతో సంతృప్తినిచ్చింది. అలాగే దివ్యాంగుల కోసం ప్రత్యేక ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశాం. పాడేరు ఐటీడీఏ పీఓగా ఉన్న సమయంలో మంచానికే పరిమితమైన ఓ మహిళా ఉద్యోగికి కొన్నినెలలపాటు ప్రతినెలా వైద్య సహాయం కోసం రవాణా ఏర్పాట్లు చేసి వైద్య సహాయం చేశాం. ఆమె తిరిగి సాధారణ స్థితికి వచ్చి బాధ్యతలు చేపట్టడం ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చింది.

సాక్షి : మీ కుటుంబ నేపథ్యం..

కలెక్టర్ : మాది తమిళనాడులోని తిరుకోవల్లూరు. నాన్న పేరు మురుగన్. ఆయన వ్యాపారం చేస్తుంటారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. కష్టపడి చదువుకుని ఐఏఎస్‌కు సెలక్టయ్యాను. 2012 బ్యాచ్. నాకు ఇద్దరు మగపిల్లలున్నారు. ఒకరు ఏడు, మరొకరు ఐదో తరగతి చదువుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ హరినారాయణన్

సాక్షి : ఇటీవల సచివాలయాలు, ఆర్బీకేలు తనిఖీ చేశారు. వాటి పనితీరు ఎలా ఉంది?

కలెక్టర్ : నా 13 సంవత్సరాల సర్వీసులో గతంలో ఎన్నడూ చూడని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, ఆర్బీకేలు తీసుకురావడం సంచలనాత్మకం. వాటిల్లో నిబంధనలు దాదాపు 80 శాతం పాటిస్తున్నారు. గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు మరింత చేరువగా అందుతున్నాయి. గతంలో సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి వెళ్లేవారు. ప్రజలు వెళ్లినప్పుడు అధికారులు ఉండొచ్చు? క్యాంప్‌లకు వెళ్లి ఉండొచ్చు. దీంతో పలుమార్లు మండల కేంద్రాలకు తిరిగి డబ్బులు ఖర్చు చేసుకునేవారు. సచివాలయాలు వచ్చాక సంక్షేమ ఫలాలు నుంచి సేవల వరకు సులువుగా అందుతున్నాయి.

సాక్షి : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ఎలా అమలవుతోంది?

కలెక్టర్ : ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జిల్లాలో మొదటి విడతలో 172 గ్రామాల్లో 98 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి పత్రాలు కూడా మంజూరు చేశాం. త్వరలో 117 గ్రామ సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించనున్నాం. రెండో విడతకు సంబంధించి 62 గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నాం.

టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(టౌన్): హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో బోధన చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం అధికారులు పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ తదితర సబ్జెక్టులు బోధించేందుకు అర్హత కలిగిన టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. జిల్లాలో మొత్తం 148 పోస్టులున్నాయి. 374 మంది దరఖాస్తు చేసుకున్నారు. 180 మంది సర్టిఫికెట్లను డీఈఓ గంగాభవాని ఆధ్వర్యంలో పరిశీలించారు. మిగిలిన వారికి శుక్రవారం వెరిఫికేషన్ చేస్తామని డీఈఓ తెలిపారు. టీచర్లు సర్వీస్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

సార్వత్రిక ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(దర్గామిట్ట): రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గురువారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెలగపూడి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఎం.హరినారాయణన్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, డ్వామా పీడీ వెంకట్రావు ఇందులో పాల్గొన్నారు.

మంత్రి చొరవతో వైద్యశాఖ సిబ్బందికి వేతనాలు

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో జిల్లాలోని వైద్య శాఖలో పనిచేస్తున్న వందమంది ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు మార్గం సుగమమైంది. ఆప్కాస్‌లో వంద మంది సిబ్బంది జిల్లా వైద్యారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. వీరికి పదినెలలుగా జీతాలు రాలేదు. ఒక్కొక్కరికి రూ.15 వేలు వంతున నెలకు చెల్లించాల్సి ఉంది. ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో వివరణ ఇవ్వాలని వైద్యశాఖాధికారులను మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మంత్రితో వైద్యశాఖ అధికారులు, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, రోస్టర్ పాయింట్ పద్ధతి ప్రకారం నియమించామని వివరిస్తూ రికార్డులు చూపించారు. దీంతో మంత్రి ఉద్యోగులకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేశారు. ట్రెజరీ ద్వారా రెండు, మూడురోజుల్లో జీతాలు రానున్నాయి. మొత్తం రూ.1.50 కోట్లు బకాయిలు విడుదలవుతాయి. ఇందుకోసం డీఎంహెచ్ఓ పెంచలయ్య ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

గాలివాన బీభత్సం



ఆత్మకూరు: జేఆర్‌పేటలో కారుపై పడిన చెట్టు కొమ్మ



అనంతసాగరం బస్టాండ్ ప్రాంతంలో ఇలా..

నెల్లూరు(దర్గామిట్ట): కొన్ని ప్రాంతాల్లో భానుడి భగభగలు.. మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం. ఇదీ గురువారం జిల్లాలో పరిస్థితి. ఆత్మకూరు, అనంతసాగరం, వింజమూరు, కలువాయి తదితర ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు గంటపాటు వర్షం కురిసింది. ఆత్మకూరు పట్టణంలో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. అక్కడి జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనంతసాగరంలో జడివాన పడింది. మండలంలోని గౌరవరం వద్ద చెట్లు రోడ్డుకు అడ్డుగా పడిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు యథావిధిగా నమోదయ్యాయి.

రథోత్సవానికి విచ్చేసి.. తరించి..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు. గంగ, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి (ఇన్‌సెట్లో)

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయ వార్షిక ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం గురువారం కనులపండువలా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఆలయం నుంచి రథం వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు నామస్మరణ చేయగా స్వామి, అమ్మవార్లను రథంలో కొలువుదీర్చారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఉభయకర్తలు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం నుంచి గ్రామంలోని వీధుల్లో ఉత్సవం జరిగింది. రథాన్ని లాగేందుకు యువత పోటీ పడ్డారు. దేవదేవేరులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అనేకమంది మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బెంగళూరుకు చెందిన దొడ్ల వెంకటరమణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె బేతిరెడ్డి సుప్రజ – త్రినాథ్‌రెడ్డి, కాళయకాగోల్లు గ్రామానికి చెందిన జక్కా కొదండరామిరెడ్డి, జక్కా వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. కాగా భక్తులకు అడుగడుగునా మజ్జిగ, తాగునీరు, అల్పాహారాన్ని దాతలు అందజేశారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, రఘురామయ్య, సుప్రజ, పద్మ, విజయమ్మ, విమల, కామేశ్వరి, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

ఆటల్లో తగ్గేదే లే..

స్మార్ట్ ఫోన్ల రాజ్యం మొదలయ్యాక చాలామంది పిల్లలు ఆటలకు దూరమయ్యారు. శారీరక శ్రమ లేక ఇబ్బందులు పడుతున్న వారు ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా క్రీడలకు చోటు అంతంతమాత్రంగానే ఉంది. దీంతో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు ఆదరణ తక్కువగా ఉంటుందని భావించారు. ఆ అంచనాలను తలకిందులు చేస్తూ అనేక మంది పిల్లలు స్టేడియంల్లో తమకు నచ్చిన ఆటలాడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

• వేసవి శిబిరాలు కళకళ
• 27 క్రీడాంశాల్లో శిక్షణ
• జిల్లాలో 64 క్రీడా శిబిరాలు
• ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు, యువత

సమయం

ఉదయం	సాయంత్రం
5.45 నుంచి 8.00 గంటల వరకు..	4.30 నుంచి 7 గంటల వరకు..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పలువురు వీటిల్లో ప్రస్థానం ప్రారంభించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన సందర్భాలు అనేకం. ఏడాది మొత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలల్లో మగ్గిపోయే విద్యార్థులు సెలవుల సందర్భంగా మైదానం వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో అవి కళకళలాడుతున్నాయి. అధికారులు కూడా ఊహించని రీతిలో అనేకమంది శిక్షణకు హాజరవుతున్నారు.

ఈ ఏడాది ఇలా..

ప్రభుత్వం ప్రతి ఏడాది వేసవిలో ప్రణాళికాబద్ధంగా క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తోంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఆడుతున్న ఆటలను బట్టి శిబిరాలను వారికి అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తోంది. ఈ సంవత్సరం జిల్లాలోని కావలి డివిజన్‌లో 10, కందుకూరులో 4, ఆత్మకూరులో 1, నెల్లూరు డివిజన్‌లో 35, ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 14 శిబిరాలు పెట్టి శిక్షణ ఇస్తున్నారు. వాటిల్లో జూన్ 10వ తేదీ వరకు పిల్లలు తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందవచ్చు. ఆయా ప్రాంతాల్లో సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు, అసోసియేషన్ నాయకులు, ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు. క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకున్న క్రీడాకారులను వారు గుర్తించి అనంతర కాలంలో శిక్షణను కొనసాగిస్తారు. స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశం, వివిధ క్రీడల్లో జిల్లా స్థాయికి ఆడేందుకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయి.

ఏ క్రీడాంశాల్లో అంటే..

ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, ఫెన్సింగ్, క్రికెట్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, రోప్ స్కిప్పింగ్, సెపక్‌తక్రా, యోగా, స్విమ్మింగ్, సాఫ్ట్‌బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, తైక్వాండో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. గ్రామీణ, మండల, పట్టణ కేంద్రాలకు చెందిన చిన్నారులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ శిబిరాలను ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. వినోదం, దేహదారుఢ్యం, క్రీడా నైపుణ్యాలే ముఖ్య లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి. ఇంకా చెస్, యోగా వివిధ కేంద్రాల్లో స్వచ్ఛందంగా పలువురు క్రీడాకారులు శిక్షణ నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు పలువురు దాతలు స్వచ్ఛందంగా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. నెల్లూరు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోజూ ఉదయం పౌష్టికాహారం ఇస్తున్నారు.



ఖో ఖో ఆడుతూ..



ఈత శిక్షణలో బాలలు

నెల్లూరు స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న పిల్లలు





బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తూ..

పౌష్టికాహారం ఇస్తున్నాం



నెల్లూరు ఏసీ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారుడికి క్రమం తప్పకుండా రోజూ పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. అసోసియేషన్ సభ్యులు, దాతల సహకారంతో రెండు దశాబ్దాలుగా ఈ ప్రక్రియ జరుగుతోంది.

– కనకట్ల రఘురాం ముదిరాజ్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఉత్సాహంగా పాల్గొంటున్నారు



ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నాం. క్రీడా పరికరాలు, శిక్షకుల గౌరవ వేతనం ప్రభుత్వ నిర్దేశానుసారం ఇస్తాం. గ్రామీణ క్రీడల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– డి.పుల్లయ్య, సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ

ప్రణాళికాబద్ధంగా శిక్షణ



జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాల్లో ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇస్తున్నాం. సంబంధిత క్రీడను నేర్పే ముందు దేహదారుఢ్య వ్యాయామం తప్పనిసరిగా ఇస్తారు. ఇప్పటికి 1,500 మంది బాలురు, 800 మంది బాలికలు వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– ఆర్‌కే ఎతిరాజ్, చీఫ్ కోచ్

శిక్షణ గురించి సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

చీఫ్ కోచ్ : 94405 81700
సీఈఓ : 98499 09074




రోడ్డు డివైడర్లపై దోమతెరలు వేసుకుని నిద్రిస్తున్న కుటుంబాలు

దోమతెరే బతుకుబండి

పగటిపూట వ్యాపారం.. రాత్రయితే అక్కడే నివాసం.. ఇలా బతుకుబండిని సాగిస్తున్నాయి కొన్ని కుటుంబాలు. రహదారి పక్కన బుక్కెడు బువ్వ వండుకుని అక్కడే తిని దోమతెరలు వేసుకుని నిద్రపోతున్న దృశ్యాలు నెల్లూరు సుబేదారుపేట ప్రాంతంలో నిత్యం కనిపిస్తుంటాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఇళ్ల నిర్మాణాల పురోగతిలో జిల్లా ఫస్ట్

- కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు (దర్గామిట్ట) : గత 15 రోజులకు సంబంధించి గృహ నిర్మాణ లక్ష్యాన్ని అధిగమించి జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల కలెక్టర్ హరినారాయణన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ ప్రత్యేకంగా అభినందించారు. అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉదయం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా నగరంలోని కలెక్టరేట్ నుంచి హరినారాయణన్, జేసీ కూర్మనాథ్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇందులో జగనన్నకు చెబుదాం, గృహ నిర్మాణం, రీసర్వే, జాతీయ రహదారులు, ప్రాజెక్టులకు భూసేకరణ, వ్యవసాయం, పశు సంవర్ధక శాఖల ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ గత 15 రోజులకు సంబంధించి 9,428 ఇళ్ల నిర్మాణాల లక్ష్యానికి గానూ 9,693 నిర్మాణాల వివిధ దశల్లో పురోగతి సాధించి, ఇచ్చిన లక్ష్యం కంటే అదనంగా ప్రగతి సాధించారని పేర్కొన్నారు. అలాగే మల్టీపర్పస్ గోదాముల నిర్మాణం, వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా కస్టం హైరింగ్ సెంటర్ల ఏర్పాటులో కూడా జిల్లా పురోగతిలో ఉందన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావ్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, పంచాయతీ అధికారి సుస్మిత, ల్యాండ్ రికార్డుల శాఖ ఏడీ హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ ఈఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్‌ఈలు రంగ వరప్రసాద్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న బీమా స్కామ్

- పేటకే పరిమితమైందా.. జిల్లా అంతటా వ్యాపించిందా?
- బీమా సంస్థను బురిడీ కొట్టించిన ఘనులు
- నకిలీ పత్రాలతో రూ.లక్షల్లో స్వాహా
- పరారీలో నిందితులు


బీమా అక్రమాలపై విచారణ చేస్తున్న సీఐ, ఎస్సై (ఫైల్)

ఇందుకూరుపేట : కరోనా కష్టకాలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడితే వారి బాధను కూడా కొందరు క్యాష్ చేసుకున్నారు. కరోనా బారిన పడకున్నా పాజిటివ్ సర్టిఫికెట్లను సృష్టించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పత్రాలు రూపొందించి రూ.లక్షలు స్వాహా చేశారు. ఇందుకూరుపేటలో వెలుగుచూసిన ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా విస్తరించిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాధితుల కోసం బీమా పథకం

కరోనా కారణంగా జిల్లాలోని వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. వైరస్ బారినపడి చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగి అప్పుల పాలయ్యారు. ఇలాంటి బాధితులను ఆదుకునేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన బీమా పథకాన్ని కొందరు స్వార్థపూరితంగా దుర్వినియోగం చేశారు. వైరస్ బారిన పడకున్నా పడినట్లు, వైద్యశాలల్లో చికిత్స పొందినట్లు పత్రాలు సృష్టించారు. లక్షలాది బీమా సొత్తును సొమ్ము చేసుకున్నారు. మొదటగా ఇందుకూరుపేటలో బయటపడిన ఈ స్కామ్ జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. ప్రధాన నిందితులందరూ పరారీలో ఉండడంతో వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

అసలు జరిగిందేమిటంటే..

ఇందుకూరుపేట బిట్–1 సచివాలయంలో మహిళా పోలీస్‌గా విజయలక్ష్మి పనిచేస్తోంది. తనతో స్నేహంగా ఉండే హోమ్‌గార్డ్ జలీల్‌తో పాటు ఈ పథకంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న ఇద్దరు, స్థానికులు కొందరు సహకారంతో ఇందుకూరుపేట కేంద్రంగా స్కామ్‌కు తెరలేపారు. సహచర సచివాలయ ఉద్యోగుల వద్ద, ఆ పరిధిలోని వలంటీర్ల నుంచి ఆధార్ కార్డులు సేకరించారు. వారికి కరోనా సోకినట్లు సర్టిఫికెట్లు సృష్టించారు. దీనికి అక్కడే పనిచేస్తున్న సచివాలయ ఏఎన్‌ఎం సహకారం అందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీమాకు అవసరమైన విధంగా బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కూడా పత్రాలు రూపొందించారు. వీటితో బీమాను క్లెయిమ్ చేశారు. బ్యాంకు ఖాతాలో జమ అయిన బీమా నగదును తిరిగి విజయలక్ష్మి, జలీల్ ఫోన్‌పే వేయించుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు సచివాలయ పరిధిలోని ఏడుగురి నుంచి రూ.17 లక్షల వరకు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బాధితులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు ముమ్మరంగా విచారణ సాగిస్తున్నారు. నిందితులతో పాటు పలువురు అనుమానితులు పరారీలో ఉండడంతో వారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితులు దొరికితే అసలు విషయం బయటపడనుంది. నిందితులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ, బీమా కంపెనీల్లో పనిచేసే వారి పాత్ర ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేయనున్నారు. దీనిపై ఎస్సై వెంకట రాజేష్‌ను వివరణ కోరాగా దీనికి సంబంధించి ముగ్గురిపై కేసు నమోదై ఉందని, వీరు పరారీలో ఉన్నారని వివరించారు. నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని చెప్పారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 162



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.52
సన్నవి	: రూ.22
పండ్లు	: రూ.15



చెట్లు నరికిన వారిపై చర్యలు తప్పవు


తాటిచెట్లను నరికి ఒక చోట వేసిన మొద్దులు (ఫైల్)

చేజర్ల : కండలేరు జలాశయం లోతట్టు ప్రాంతంలో ఇటీవల చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుగు గంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి గురువారం తెలిపారు. సాక్షి దిన పత్రికలో బుధవారం 'తాటిచెట్ల అక్రమ నరికివేత' శీర్షికన కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఎస్‌ఈ జలాశయం ప్రాంతంలో తాటిచెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జలాశయ సంరక్షణ కోసం అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే చెట్లను నరికివేయడం తప్పు అని, ఇలాంటి చర్యలను అడ్డుకునే విధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

వైభవంగా చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు

- భక్తుల రద్దీ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు
- స్థానికుల సహకారం ఎంతో అవసరం
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, ఆలయ చైర్మన్ బాలచంద్రారెడ్డి

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలను జూన్ 8 నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. పట్టణంలోని ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి తమిళం, తెలుగు భాషల్లో ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ సారి తమిళంలో వాల్ పోస్టర్లు ముద్రించామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి వాటంబేడు రోడ్డులోని సుమారు 25 ఎకరాల్లో బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జూన్ 8న రాత్రి బలిహరణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుళ్ల ఉత్సవం, రాత్రి అశ్వ వాహనం, 10న సాయంత్రం 4కి సుళ్ల ఉత్సవం, మహిషాసురమర్దిని అనంతరం రాత్రి 10 గంటలకు సింహ వాహన సేవ, 11న సాయంత్రం 4కి సుళ్ల ఉత్సవం, నంది వాహన సేవ, 12న సాయంత్రం 7 గంటలకు కాళంగినదిలో తెప్పోత్సవం, అనంతరం రాత్రి 10కి గ్రామోత్సవం, 13న రాత్రి 9 గంటలకు శయనసేవ, గ్రామోత్సవం, 14న రాత్రి 8 గంటలకు పుష్పపల్లకి సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 12 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు వంకా దినేష్‌కుమార్, కర్లపూడి సురేష్‌బాబు, ఓలేటి సత్యనారాయణ, బండి సునీత, చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్, పార్టీ నేతలు జెట్టి వేణుయాదవ్, ఈశ్వరవాక శ్రీనివాసులురెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్ల చోరీ ముఠా అరెస్ట్

- రూ.20 లక్షల విలువైన ఫోన్ల స్వాధీనం


పట్టుబడిన స్మార్ట్ ఫోన్లు, నిందితులతో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్, సిబ్బంది

పలమనేరు: స్మార్ట్ ఫోన్లను చోరీ చేసే ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.20 లక్షల ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన అర్బన్ పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన పలమనేరు గంగ జాతరలో కొందరి స్మార్ట్ ఫోన్లు చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. కేసులు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పాతనేరస్తుల పనిగా గుర్తించారు. ఆ మేరకు పట్టణంలోని జెండా మఠానికి చెందిన బలరామ్ కుమారుడు సూరిబాబుని బుధవారం అదుపులోకి తీసుకుని వారింట్లో తనిఖీ చేసి 108 స్మార్ట్ ఫోన్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడిని విచారించగా తనతోపాటు పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన యశ్వంత్‌సాయి, హైదర్‌వలీ కుమారుడు యూసూఫ్ కలిసి గత కొన్నాళ్లుగా స్మార్ట్ ఫోన్లను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో వారిని సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురూ కలిసి పాత కార్లను బాడుగకు తీసుకుని బస్టాండ్, కూరగాయల మార్కెట్లు, బస్సుల కోసం రాత్రి పూట వేచి ఉండేవారు. జాతరల్లో చాకచక్యంగా ఫోన్లను చోరీ చేసేవారు. ఆ ఫోన్లను పలమనేరుతో పాటు బంగారుపాళెం, చిత్తూరు, సోమల, బైరెడ్డిపల్లి, పుత్తూరు, తిరుపతి, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లా రాయచోటి, తమిళనాడులోని పలుచోట్ల విక్రయించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుబ్బారెడ్డిని ఆయన అభినందించారు. స్థానిక క్రైమ్ పార్టీ ఏఎస్సైలు దేవరాజులు, శ్రీనివాసులు, సిబ్బంది వేణు, అల్లాఉద్దీన్, ప్రకాష్, అశోక్, బాలాజీ, శశిలకు రివార్డు కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

అతిగా మద్యం తాగి వీరంగం

- గుర్తుతెలియని వృద్ధుడిపై దాడి
- చికిత్స పొందుతూ మృతి
- ఇద్దరు మైనర్లతో పాటు యువకుడిపై హత్య కేసు నమోదు

కావలి : అతిగా మద్యం తాగిన ఓ యువకుడు, ఇద్దరు మైనర్లు పలువురిని గాయపరిచారు. వస్తువుల చోరీకి పాల్పడడంతో పాటు ఓ గుర్తుతెలియని వృద్ధుడిపై దాడికి పాల్పడి అతని మరణానికి కారణమయ్యారు. దీంతో కావలి వన్‌టౌన్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు గురువారం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కావలి పట్టణానికి చెందిన 21, 17, 16 ఏళ్ల వయసున్న ముగ్గురు యువకులు అతిగా మద్యం సేవించి బైక్‌పై ఈనెల 8వ తేదీ రాత్రి పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేసి, వస్తువులు లాక్కున్నారు. ఇందులో మూడు ఘటనలు పోలీసుల దృష్టికి వచ్చాయి. కాగా పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లారు. అలాగే వెంకటేశ్వర సినిమా హాలు వద్ద దంపతులు వెళ్తుండగా వారిపై దాడి చేసి మహిళ మెడలో చైన్ లాక్కొని వెళ్లారు. కలుగోళమ్మ గుడి వద్ద ఒక వృద్ధుడిపై దాడి చేశారు. దీంతో అతన్ని తొలుత కావలి ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో వృద్ధుడు ఉండడంతో వివరాలు తెలియరాలేదు. కాగా వృద్ధుడు ఈనెల 12వ తేదీ మరణించాడు. దీంతో కావలి వన్ టౌన్ సీఐ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి యువకులను గుర్తించే పనిలో పడి ఎట్టకేలకు వారిని అదుపులోకి తీసుకున్నారు. 21 ఏళ్ల యువకుడిని కావలి కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేసింది. ఇద్దరు మైనర్లను జువైనెల్‌కు తరలించారు.

పెన్నా డెల్టాకు నీటి విడుదల



చేజర్ల(సోమశిల) : సోమశిల జలాశయం నుంచి 12వ క్రస్టు గేటు ద్వారా పెన్నా డెల్టాకు అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. గతంలో డెల్టాకు 2,750 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, సాగునీటి అవసరాల దృష్ట్యా మరో 900 క్యూసెక్కుల నీటిని అదనంగా విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం జలాశయంలో 95.492 మీటర్లు, 313.294 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. 45.940 టీఎంసీల నీరు జలాశయంలో నిల్వ ఉండగా, 3,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 550 క్యూసెక్కుల నీటిని నాన్‌డెల్టా లైన్ ఉత్తర, దక్షిణ కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. అయితే రోజుకు సగటున 256 క్యూసెక్కుల వంతున నీరు ఆవిరి అవుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు వివరించారు.

హనుమంతుడు కార్యశూరుడు

- విద్యాశంకర భారతి స్వామి
- ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు


మాట్లాడుతున్న విద్యాశంకర భారతిస్వామి

తిరుమల : రామకార్యం కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటుకుని, రాక్షస సంహారం చేసి లంకలో సీతమ్మ జాడ కనిపెట్టిన హనుమంతుడు కార్యశూరుడు అని హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి తెలిపారు. తిరుమలలో ఐదు రోజుల పాటు జరిగిన హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు నాదనీరాజనం వేదికపై స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. హనుమంతుడు గొప్ప సుగుణాలు గలవాడని, ఆయన ముఖం ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉండేదని చెప్పారు. తల్లి అంజనాదేవి పేరుని తన పేరుగా పెట్టుకుని ఆంజనేయుడు అయ్యాడన్నారు. హనుమంతుడి బలపరాక్రమాలపైన రాముడికి ఎంతో నమ్మకం ఉందని, రాముడు ఆదేశించగానే లక్ష్య సాధన కోసం బయలుదేరారని వివరించారు. హనుమంతుని దృక్కోణంలో చూస్తే రామాయణం మొత్తం నేటి సమాజానికి అర్థమవుతుందన్నారు. రాముడిని ఎక్కడ కీర్తిస్తే అక్కడ హనుమంతుడు ప్రత్యక్షమవుతారని, వీరిది విడదీయరాని అనుబంధమని చెప్పారు. అంతకు ముందు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు పీవీఎస్ఎన్.మారుతి హనుమంతుడు సాధించిన విజయాలు అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు

ఆకాశగంగలోని బాలాంజనేయ స్వామివారి ఆలయం వద్ద హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు భజనలు చేశారు. తర్వాత దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు హనుమ సంకీర్తనల గానం, భజన కార్యక్రమం జరిగింది.